క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వలవన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్. కరికాల వలవన్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు, దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదంతో పాటు జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

కల్యాణం.. కమనీయం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్మశాన వాటిక స్థలానికి రక్షణ కల్పించండి

పరవాడ: రావాడ శివారు గొల్లగుంట శ్మశాన వాటిక స్థలానికి రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గొల్లగుంట గ్రామంలో ముస్లింలకు చెందిన శ్మశాన వాటికను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

సామాజిక సాధికార యాత్రకు ఏర్పాట్లు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- విజయవంతం చేయాలని పిలుపు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: సబ్బవరంలో ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. దళాయిపాలెంలోని ఎమ్మెల్యే అతిథి గృహంలో శనివారం కార్యకర్తలతో ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్షించారు.ఆ రోజు జరగనున్న బస్సు యాత్రకు మండలం నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఆంధ్రాకు మళ్లీ జగనన్న కావాలి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ముఖ్య నాయకులు, జేసీఎస్ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రసాయనం పడి కార్మికుడికి గాయాలు


లాగూర్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సంస్థ అధికారులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో లాగూర్ లేబొరేటరీ పరిశ్రమలో హెచ్‌సీఎల్ వాల్వ్ బిగిస్తుండగా శనివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పరిశ్రమలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో హెచ్‌సీఎల్ టాంక్ వాల్వు లీక్ అవుతున్నట్లు కార్మికుడు సాయిరామ్ గుర్తించాడు. వెంటనే ఆ ప్రదేశం వద్దకు వెళ్లి వాల్వ్ బిగిస్తుండగా బోల్టు ఒక్క సారిగా బయటకు రావడంతో అధిక మొత్తంలో సాల్వెంట్ రసాయనం బయటకు వచ్చి అక్కడే ఉన్న సాయిరామ్ చేతిపై పడడంతో చేతికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన యాజమాన్యం వెంటనే గాయపడిన సాయిరామ్‌ను చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా గాయపడిన సాయిరాంకు మెరుగైన వైద్యం అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

కరువు మండలంగా ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజు

పరవాడ: వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న అన్నదాతలను దృష్టిలో ఉంచుకొని పరవాడను కరువు మండలంగా ప్రకటించాలని జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు కోరారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పి.ఎస్.రాజు ఈ విషయాన్ని లేవనెత్తారు. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనధికార క్వారీలపై అధికారులు కొరడా ఝుళిపించాలని జెడ్పీటీసీ రాజు డిమాండ్ చేశారు.

పాఠకులకు చేరువగా గ్రంథాలయాలు

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్‌బాబు


అడవివరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌బాబు


పెందుర్తిలో మహేషబాబును సత్కరిస్తున్న గ్రంథాలయశాఖ అధికారులు

సింహాచలం: గ్రంథాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జె.మహేష్‌బాబు కోరారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఆయన అధికార బృందంతో కలిసి పరిశీలించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. గ్రంథాలయాల్లో పాఠకుల సౌకర్యార్థం ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దానిలో భాగంగానే గ్రంథాలయాల అభివృద్ధిదించేందుకు బ్రిటన్‌లోని అతి పెద్ద గ్రంథాలయంతో పరస్పరం ఒప్పందం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. అడవివరం గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు చదివి పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో ప్రశంసలు కురిపించారు. గ్రంథాలయ సంస్థ సహాయ సంచాలకుడు వి.రవికుమార్ మాట్లాడుతూ గ్రంథాలయ సేవలను విస్తృత పరచడంలో విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్. వెంకటరావు మాట్లాడుతూ అడవివరం గ్రంథాలయం అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదివి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన కె. సురేష్‌ను సత్కరించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, రీడర్ ఫోరం కమిటీ సభ్యుడు బి.బి.రాజేంద్రప్రసాద్, కార్మిక నాయకుడు రాజు, అడవివం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు కృష్ణ, న్యాయవాది రామకృష్ణ, పాఠకులు జయచంద్ర, భానుమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పెందుర్తి: ఎనలేని విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పాలకవర్గ సభ్యుడు జి.మహేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకట్రావుతో కలిసి సందర్శించారు. చిత్రలేఖనం పోటీలను తిలకించి విద్యార్థులను అభినందించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ చేతుల మీదుగా మహేష్‌బాబు, వెంకట్రావులను ఘనంగా సత్కరించారు.

జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు హెటిరో డ్రగ్స్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఎంపికకు 56 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 25 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను అసిస్టెంట్ మేనేజర్ ఐ. నరేష్,కంపెనీ అధికారి శ్రీనరసింహం, ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి,జేకేసీ కోఆర్డినేటర్ బి. శంకర్,అధ్యాపకులు, సిబ్బంది వీవీజే గోపాల కృష్ణ ,ఎల్. గణేష్,ఎం. రత్నప్రకాష్,కె. దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


లక్ష్మణరావు

పెందుర్తి: ప్రహ్లాదపురం సమీపంలోని పల్లినారాయణపురానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గడగమ్మ కొండలరావు కుమారుడు లక్ష్మణరావు టెక్ మహీంద్ర కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు తనకు బదిలీ అయిందని చెప్పి ఈ నెల 5న షాపింగ్ కోసమని బయటకు వెళ్లాడు. అయితే ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెచ్‌సీ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ


వేంకటేశ్వరస్వామికి తులసి పూజ చేస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో పవిత్రోత్సవాల్లో బాగంగా రెండోరోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి లక్ష తులసి అర్చన విశేషంగా చేశారు. సప్త హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈవో నీలిమ, ఆలయ సేవకులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యాగశాల అర్చన, వేంకటేశ్వర హోమం, సాయంత్రం గోదా పద్మాదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌కు కృషి


జీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇచ్చేలా రైల్వే ఉన్నతాధికారులతో చర్చిస్తామని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్ నరసింహారావు అన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పెందుర్తి రైల్వే స్టేషన్‌ను శనివారం జీవీఎల్ సందర్శించారు. రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇచ్చేలా చూడాలని స్థానికులు విన్నవించారు. రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి గురించి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాలని కోరారు. దీనిపై స్పందించిన జీవీఎల్ త్వరలోనే రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి ఆయా సమస్యలు తీసుకువెళతానని చెప్పారు. పెందుర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు, పెందుర్తి పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

దేశ ప్రజల క్షేమం కోసం ప్రార్థన


వాక్యోపదేశం ఇస్తున్న పాస్టర్

పెందుర్తి: సుజాతనగర్‌లోని అగాపే క్రిష్టియన్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో శనివారం ఉజ్జీవ ప్రార్థన మహోత్సవం నిర్వహించారు. రెవ డాక్టర్ సిల్వి కొత్తపల్లి, బిషప్ ఎం.ఎ పాల్, రెవ అరుణ్ పాల్ వాఖ్యోపదేశం చేస్తూ దేశ ప్రజలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. ఏసుక్రీస్తు మార్గం గొప్పదన్నారు. చర్చి ఫాదర్ తోమస్ ప్రవీణ్, క్రైస్తవ పెద్దలు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా

- ఎంపీడీవో రమేష్‌నాయుడు


పీడీలతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: ఆడుదాం ఆంధ్రాను మండలంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు అన్నారు. ఐదు క్రీడాంశాల్లో వలంటీర్లకు శనివారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.1.క్రికెట్, 2 వాలీబాల్, 3.బ్యాడ్మింటన్, 4 కబడ్డీ, 5.ఖోఖోలో శిక్షణ ఇచ్చారు.క్రికెట్, ఖోఖో శిక్షణ సబ్బవరంలోని మదర్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. క్రికెట్‌కు శిక్షకులుగా ఆరిపాక జిల్లా పరిషత్ పాఠశాల పీడీ వీసీకే వర్మ వ్యవహరించగా, ఖోఖోకు రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రఘు,అదే పాఠశాల పీఈటీ రామస్వామి వ్యవహరించారు.వాలీబాల్, బ్యాడ్మింటన్ శిక్షణ సబ్బవరం గురుకుల పాఠశాలలో నిర్వహించారు. వాలీబాల్ శిక్షకుడిగా నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ సుజాత, బ్యాడ్మింటన్ శిక్షకుడిగా గురుకుల పాఠశాల పీడీ సూర్యనారాయణ వ్యవహరించారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ శిక్షకులుగా మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రమణమ్మ, అర్కిడ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పీఈటీ హరికృష్ణ వ్యవహరించారు. ఎంఈవోలతో పాటు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

రేషన్ వాహనాలపై మోదీ స్టిక్కర్ పెట్టాలి

పరవాడ: రాష్ట్రంలో రేషన్ సరఫరా వాహనాలపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి మోసా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధి కె.అప్పారావు, సీనియర్ నాయకులు వాసుపల్లి సోమశేఖర్, ఎ.నూకరాజు, ఎ.రాజకుమార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పెందుర్తి: టీనేజ్ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విశ్రాంత న్యాయమూర్తి పైలా సన్నిబాబు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్, సింహాద్రి టీఎంటీ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు–అనర్థాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ ఆధునిక జీవనంలో విద్యార్థి దశ నుంచే కొందరు యువకులు డ్రగ్స్, ఇతర మత్తుకు బానిసలవడం దురదృష్టకరమన్నారు. చెడు స్నేహాలు మంచివి కావన్నారు. యువతకు అవగాహన కలిగించేందుకు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు నరవ రాంబాబు, సంస్థ చైర్మన్ బి.ఎన్ మూర్తి, ప్రతినిధులు శరగడం సురేష్, టి.వి.డి దాస్, సుంకాన శ్రీనివాస్, కుమార్, కాపుశెట్టి కల్యాణ్, పట్నాల రామకృష్ణ, బత్తుల కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి లేఅవుట్‌కి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ బాలకృష్ణ

సింహాచలం: గోపాలపట్నంలో ఉన్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేపగుంట నుంచి సింహాచలం వెళ్లే బీఆర్‌టీఎస్ మెయిన్‌రోడ్డులోని 98వవార్డు సింహపురి లేఅవుట్‌కు మార్పు చేశారు. సింహపురి లేఅవుట్ ఆర్చి పక్కన కొత్తగా నిర్మించిన భవనంలోకి మార్పు చేసిన కార్యాలయాన్ని శనివారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విశాఖపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) జి.బాలకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా రిజిస్ట్రార్ ఎం. సృజన, డిస్ట్రిక్ రిజిస్ట్రార్(ఎంవీ అండ్ ఆడిట్)కె.మన్మథరావు, గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ పీవీఎస్.మాధవికుమారి, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్లు కె.ఎస్.బాబ్జి, రమేష్ కుమార్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీఆర్‌ఎస్ గెలవాలని పూజలు


తొలిపావంచ వద్ద స్వామికి పూజలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సింహాచలం: తెలంగాణలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అఖండ విజయం సాధించాలని కోరుతూ ఆ పార్టీ విశాఖ నాయకులు శనివారం కొండదిగువ తొలిపావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి పూజలు నిర్వహించారు. 101 కొబ్బరికాయలు కొట్టారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని స్వామిని వేడుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీఆర్‌ఎస్‌ని బలోపేతం చేస్తామని తెలిపారు. ఏపీ బీఆర్‌ఎస్ నాయకులు తలారి సురేష్, రామారావు,కె.రామ్మోహననాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌క్లబ్ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల స్వీకరణ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 స్టీల్‌క్లబ్ పాలకవర్గం ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. అన్ని పోస్టులకు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నెల 26న జరగనున్న పాలకవర్గం ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్లు స్వీకరించారు. ఎన్నికల అధికారి జె.వి.రావు నేతృత్వంలో జరిగిన ప్రక్రియలో కార్యదర్శి పోస్టులకు పెంటకోట రామకృష్ణ, ఎస్.వీరాస్వామి, ఎస్.ఎల్.ఎన్.రావు, ఎస్.వి. సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి పోస్టుకు కోన సత్యనారాయణ, డి.వేణుగోపాల్, జి.సురేష్, కర్రి సుమాంజలి పోటీలో ఉన్నారు. కోశాధికారి పోస్టుకు ఆర్.సత్యనారాయణ, కుంచె సత్యనారాయణ నామినేషన్లు వేశారు. గ్రూప్–1కు చెందిన రెండు పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు బి.వి.రమణ, వై.రవికుమార్, డి.ఉమామహేష్ నామినేషన్లు దాఖలు చేశారు. గ్రూప్–2లోని ఐదు పోస్టులకు 8 మంది అభ్యర్థులు కె.ఎల్.నరసింహం, ఎం.కృష్ణయ్య, బి.చిట్టిబాబు, పి.పరమేశ్వరరెడ్డి, ఎ.శివశంకర రెడ్డి, ఎ.శ్రీనివాస వర్మ, వి.అప్పలరాజు, వి.ఎస్.బి.రాజు నామినేషన్లు వేశారు.

శాఖా గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు

సబ్బవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.ఈ పోటీలను సబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు రాధాకుమారి ప్రారంభించారు.విద్యార్థులు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకత బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరి,రామలక్ష్మి,మనోజ్ పాల్గొన్నారు.

తిరుమల బాలాజీ ఆలయానికి రూ. లక్ష విరాళం

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రానికి 88వ వార్డు గవర జగ్గరాజుపాలేనికి చెందిన ఆళ్ల బూలిరాజు దంపతులు రూ.1 లక్ష విరాళం అందజేశారు. శనివారం రాత్రి స్వామిని దర్శించుకున్న దాతలు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు ఆ నగదును అందజేశారు. తిరుమల బాలాజీకి వెండి ఆభరణాల నిమిత్తం ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు.

జీపీఎఫ్ రుణాలు మంజూరు చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు జీపీఎఫ్ లోన్లు సకాలంలో మంజూరు చేసేలా తగిన చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈవో పోలినాయుడుకు పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ కోరారు. శనివారం జెడ్పీ సీఈవోను కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలతో కొంత మంది ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో వేతనాల నుంచి మినహాయించిన డబ్బులు జమ కావటం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు మేలు చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.అదే విధంగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.